# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 09-08-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ న్యూజిలాండ్ లోని ఆక్లాండ్‌లో కాన్సులేట్‌ను ప్రారంభించనున్నామని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రకటించారు.
- ❖ "హర్ ఘర్ తిరంగా" ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కోరారు.
- ❖ పార్లమెంటు ఉభయ సభలను సోమవారానికి వాయిదాపేశారు.
- ❖ గాజాలో కాల్పుల విరమణపై హమాస్ తో చర్చలకు సిద్ధమని ఇజ్రాయిల్ తెలిపింది.
- ❖ జమ్మూ కాశ్మీర్‌లో వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం కట్టుబడి ఉందని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు.

===========================

న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా ఈరోజు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆక్లాండ్‌లోని ప్రవాస భారతీయులను ఉద్దేశించి, భారత హైకమిషన్ నిర్వహించిన రిసెప్షన్‌లో ప్రసంగించారు. న్యూజిలాండ్ అభివృద్ధిలో భారతీయులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నందుకు అభినందించారు. వ్యాపారం నుంచి విద్య వరకు, వైద్యం నుండి సాంకేతికత వరకు, వారి సహకారం అమూల్యమైనదన్నారు. భారత్ - న్యూజిలాండ్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల పురోగతిపై రాష్ట్రపతి సంతోషం వ్యక్తం చేశారు. ఆక్లాండ్‌లోని భారతీయ ప్రవాసుల చిరకాల కోరికను నెరవేర్చేందుకు త్వరలో ఆక్లాండ్‌లో కాన్సులేట్‌ను ప్రారంభించనున్నామని రాష్ట్రపతి ప్రకటించారు. భారత్-న్యూజిలాండ్ దౌత్య సంబంధాలను మరింత మెరుగుపర్చడంలో ఇది ప్రధాన పాత్ర పోషిస్తుందని రాష్ట్రపతి విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం అనంతరం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తైమూర్-లెస్టేకి బయలుదేరారు.

===========================

సామాజిక మాధ్యమ వేదికల్లో త్రివర్ణ పతాకాన్ని కలిగి ఉన్న వారి ప్రొఫైల్ చిత్రాన్ని మార్చుకోవాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పౌరులను కోరారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నరేంద్రమోదీ తన ప్రొఫైల్ చిత్రాన్ని త్రివర్ణ పతాకానికి మార్చుకున్నారు. “హర్ ఘర్ తిరంగా” ఉద్యమాన్ని చిరస్మరణీయ ప్రజా ఉద్యమంగా మార్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఇదిలా ఉండగా ఈ రోజు క్విట్ ఇండియా ఉద్యమం వార్షికోత్సవం సందర్భంగా మహాత్మా గాంధీ నాయకత్వంలో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న వారందరికీ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నివాళులర్పించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంటు ఉభయ సభలు సోమవారానికి వాయిదా పడ్డాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు గత నెల 22న ప్రారంభమై సోమవారంతో ముగియనున్నాయి. 115 గంటల పాటు జరిగిన ఈ సెషన్‌లో 15 సమావేశాలు జరిగాయని సభాపతి ఓం బిర్లా ఈరోజు తెలిపారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 కేంద్ర బడ్జెట్‌ను జూలై 23న సమర్పించారని, దీనిపై సభ 27 గంటల 19 నిమిషాల పాటు చర్చించిందని ఆయన తెలియజేశారు. ఈ సమావేశంలో 12 ప్రభుత్వ బిల్లులు ప్రవేశపెట్టగా, వాటిలో 4 బిల్లులను లోకసభ ఆమోదించిందని తెలిపారు. వీటిలో ఆర్థిక బిల్లు, విభజన బిల్లు, జమ్మూ కాశ్మీర్ విభజన బిల్లు, భారతీయ వాయుయాన్ విధేయక్ లు దిగువ సభలో ఆమోదించబడ్డాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రైల్వే (సవరణ) బిల్లు 2024ను ఈరోజు లోకసభలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రవేశపెట్టారు. ఈ బిల్లును ప్రవేశపెట్టిన ఈ సందర్భంగా రైల్వే మంత్రి మాట్లాడుతూ... 1989లో తీసుకొచ్చిన రైల్వే చట్టాన్ని సవరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ బిల్లు రైల్వే బోర్డు అధికారాలను మరింత విస్తృతం చేస్తుందని, రైల్వేల సామర్థ్యాన్ని పెంపొందిస్తుందని అన్నారు. భారతీయ రైల్వే బోర్డులోని చట్టపరమైన విధి విధానాలను సరళీకృతం చేసేందుకు ఈ బిల్లు ఉపకరిస్తుందని కేంద్రమంత్రి వివరిస్తూ....

(వాయిస్ 40 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ మూడు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా ఈరోజు  నుంచి మాల్దీవుల్లో పర్యటించనున్నారు. ఈ పర్యటన రెండు దేశాల మధ్య సన్నిహిత భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంతో పాటు ద్వైపాక్షిక సంబంధాలను మరింత మెరుగుపరిచేందుకు లక్ష్యంగా పెట్టుకుంది. మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు ఇటీవల భారతదేశానికి వచ్చిన తరువాత ఈ పర్యటన జరుగుతుంది. మాల్దీవులు భారతదేశానికి కీలకమైన సముద్ర పొరుగు దేశం మరియు హిందూ మహాసముద్రంలో వ్యూహాత్మక స్థానాన్ని కలిగి ఉంది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

గాజాలో కొనసాగుతున్న సంఘర్షణను తగ్గించడానికి చర్చలను పునఃప్రారంభించాలని అమెరికా, ఈజిప్ట్, ఖతార్ దేశాలు ఇజ్రాయెల్ హమాస్‌లకు పిలుపునిచ్చాయి. ఈ మేరకు మూడు దేశాలు సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. సంక్షోభానికి శాంతియుత పరిష్కారాన్ని కనుగొనాలని,  పౌరుల శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇవ్వాలని ఇరు దేశాలను కోరాయి. శాశ్వత కాల్పుల విరమణకు చర్చల ద్వారా ప్రయత్నించాలని సూచించాయి. కాగా దోహా లేదా కైరోలో ఆగస్టు 15వ తేదీన జరిగే ప్రతిపాదిత చర్చలకు సంధానకర్తలను పంపుతామని ఇజ్రాయెల్ తెలిపింది. హమాస్ ఇంకా స్పందించాల్సి ఉంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జమ్మూ కాశ్మీర్‌లో వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం కట్టుబడి ఉందని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. ఈరోజు జమ్మూలో పాత్రికేయుల సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ, జమ్మూ కాశ్మీర్‌లోని అన్ని రాజకీయ పార్టీలు అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు అనుకూలంగా ఉన్నాయని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతను సమీక్షించేందుకు ఎన్నికల సంఘం జమ్మూకశ్మీర్ చీఫ్ సెక్రటరీ, పోలీస్ చీఫ్‌తో చర్చలు నిర్వహించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ నేతృత్వంలోని ఎన్నికల సంఘం ప్రతినిధి బృందం కేంద్ర పాలిత ప్రాంతంలో మూడు రోజుల పర్యటనలో భాగంగా ఎన్నికల నిర్వహణ, భద్రతా సంస్థల సన్నద్ధతను ఈరోజు  సమీక్షించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రష్యా సైన్యంలోని భారతీయులపై ఇప్పటి వరకు 91 కేసులు నమోదయ్యాయని విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ తెలిపారు. లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్రమంత్రి సమాధానమిస్తూ.... వారిలో 8 మంది దురదృష్టవశాత్తు మరణించారని 14 మంది సైన్యం నుంచి విరమింపపడ్డారని తెలిపారు. రష్యా విదేశాంగ మంత్రిని కలిసి ఈ అంశాన్ని పలుమార్లు ప్రస్తావించామన్నారు. రష్యా సైన్యంలోకి భారతీయ పౌరుల్ని బలవంతంగా చేర్చిన  19 మంది వ్యక్తులు, సంస్థలపై సీబీఐ క్రిమినల్ కేసు నమోదు చేసిందని కేంద్ర మంత్రి తెలియజేస్తూ.....

(వాయిస్ 44 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఈరోజు లోక్‌సభలో "సముద్ర మార్గపు వస్తు రవాణా" బిల్లును కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ ప్రవేశపెట్టారు. ఈ బిల్లును ప్రవేశపెడుతూ... సముద్రం ద్వారా సరకుల రవాణాకు సంబంధించి క్యారియర్‌లకు అనుమతించబడిన బాధ్యతలు, హక్కులను తెలియజేయడం ఈ బిల్లు లక్ష్యమని మంత్రి తెలిపారు. 1925 నాటి "ఇండియన్ క్యారేజ్ ఆఫ్ గూడ్స్ యాక్ట్"ను దాదాపు 100 సంవత్సరాల క్రితం తీసుకొచ్చింది కాబట్టి అత్యవసర మార్పులు అవసరమని అన్నారు. అంతర్జాతీయ సదస్సు, మారుతున్న పరిణామాలకు అనుగుణంగా ఆదేశాలు జారీ చేసేందుకు ప్రభుత్వానికి అధికారం కల్పించేందుకు ఈ బిల్లు ప్రయత్నిస్తోందని మంత్రి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలోని కొన్ని ప్రాంతాలలో ప్రస్తుత పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఇజ్రాయెల్‌లోని టెల్ అవివ్‌కు ఎయిర్ ఇండియా విమాన కార్యకలాపాలను నిలిపివేసింది. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నామని ప్రయాణీకులు, సిబ్బంది భద్రత కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని ఎయిర్ ఇండియా సామాజిక మాధ్యమం వేదికగా తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పారిస్ ఒలింపిక్స్‌లో, భారతదేశపు క్రీడాకారుడు నీరజ్ చోప్రా పురుషుల జావెలిన్ ఫినల్స్ లో సీజన్ అత్యుత్తమ త్రో 89.45 మీటర్లతో రజత పతకాన్ని సాధించాడు. స్వాతంత్ర్యం తర్వాత రెండు ఒలింపిక్ పతకాలను గెలుచుకున్న మొదటి భారతీయ ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్‌గా నీరజ్ చోప్రా నిలిచాడు. నీరజ్ సాధించిన ఈ చారిత్రాత్మక విజయానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ద్రౌపది ముర్ము నీరజ్ సాధించిన విజయాన్ని ప్రశంసిస్తూ... అతని విజయం భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిస్తుందన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు రావడంతో పాటు ఐటీ షేర్లలో కొనుగోళ్లు సూచీలకు కలిసొచ్చింది. సెన్సెక్స్ 800 పాయింట్ల మేర లాభపడగా.. నిఫ్టీ 24 వేల 350 ఎగువన ముగిసింది.

============================

============================